,

# బాల వేదిక



రచన: వెంకట సుబ్బారాయుడు
Email: subbarayudu7@yahoo.com

ఆర్ట్ వర్క్: రాజు ఈపూరి

## సరైన నిర్ణయం



,

**అనగనగా ఒక అడవి. అందులో ఎన్నో రకాల జంతువులు హాయిగా కాలం గడుపుతుండేవి.**

ఒకనాడు ఆ అడవిలోకి జిరాఫీ వచ్చింది. అప్పటిదాకా ఆ అడవిలోని జంతువులు అలాంటి జంతువుని చూసివుండలేదు. అందుకని అన్నీకలసి మొదట ఆశ్చర్యపోయి, పిదప భయపడిపోయి, ఆ తర్వాత అన్నీ కలసి నిలదీశాయి "నువ్వెవరని".

"నా పేరు జిరాఫీ, నేనూ మీలాంటి జంతువునే. మా అడవిలోంచి నడుస్తూ నడుస్తూ తప్పిపోయి ఇక్కడికి, మీ మధ్యకి వచ్చాను. నన్ను మీరు నమ్మొచ్చు. మీకేం అపకారం తలపెట్టను." అంది మెత్తని స్వరంతో.

"అయినా సరే, అంత పొడవైన మెడతో విచిత్రంగా ఉన్న నిన్ను మేము ఆమోదించం. దయచేసి వెళ్ళిపో" అన్నాయి.

పాపం జిరాఫీ బిక్కమొహమేసుకుని ఏం చేయాలో పాలుపోక అలాగే నిల్చుండిపోయింది.

కాసేపటి తర్వాత అక్కడకి ఒక కుందేలు వచ్చింది. అది బహు తెలివైనదని అక్కడి జంతువుల నమ్మకం. అది చెప్పింది వింటాయి. ఆచరిస్తాయి. అవన్నీ జిరాఫీ విషయం చెప్పి, దాన్ని పొమ్మన్నా పోవడం లేదని చెప్పాయి.

దానికా కుందేలు కాసేపు ఆలోచించి "జిరాఫీ పాపం దారి తప్పి మన దగ్గరకి వచ్చింది. మీరు చెప్పిన దాన్ని బట్టీ, నేను చూసినదాన్ని బట్టీ అది నాకు అనుమానాస్పదంగా కనిపించడంలేదు. అందుచేత జిరాఫీని మన మిత్రుడిని చేసుకుందాం. కొన్నాళ్ళు దాని నడవడిక చూసిన తర్వాత మరోసారి నిర్ణయం తీసుకుందాం. ఏమంటారు?"అంది.

అన్నీ ఆ కుందేలు చెప్పిన దానికి ఆమోదముద్ర వేశాయి.

జిరాఫీ ఆనందం అంతా ఇంతాకాదు. కుందేలుతో సహా జంతువులన్నిటికీ..స్నేహభావంతో తనకి ఆసరా కల్పించినందుకు కృతజ్ఞతలు చెప్పింది. జిరాఫీకి ఆ అడవి కొత్త కావడంతో.. ఉత్సాహంతో ఉరకలెత్తింది. అణువణువు ఎగిరి గంతులేస్తూ చూసింది.

జిరాఫీ మెడ పెద్దది అవడం వల్ల ఎవరైనా వేటకొస్తుంటే దూరం నుంచే పసిగట్టి జంతువులని అప్రమత్తం చేసేది. చెట్లు ఎక్కలేని చిన్న చిన్న జంతువులకి చెట్ల పైనుండే కాయలూ, పళ్లూ లేత చివుళ్లూ అలవోకగా కోసి అందించేది. అది ఆ అడవిలోకి వచ్చాక అన్నీ ఎంతో ధైర్యంగా, ఆనందంగా అడవంతా స్వేచ్ఛగా సంచరించసాగాయి.

కొన్నాళ్ళ తర్వాత జిరాఫీని 'తమ అడవిలో కొనసాగనివ్వాలా? లేదా?' అన్న విషయం చర్చకు వచ్చింది.

"కుందేలు మామా! నువ్వు చెప్పింది నిజమే, కొత్తవాళ్లని అనుమానించాలి అలా అని నమ్మకుండానూ ఉండకూడదు. ఆరోజు నువ్వు రావడం కాస్త ఆలస్యం అయివుంటే మంచి మిత్రుణ్ని కోల్పోయివుండేవాళ్లం. మన జీవితాలు గాల్లో పెట్టిన దీపాల్లా వుండేవి. 'ఎప్పుడు ఎవరొచ్చి వేటాడి పట్టుకుపోతారా' అని బిక్కు బిక్కు మంటూ మన అడవిలో మనమే భయంతో ఉండేవాళ్లం. అంతేకాదు చిటారుకొమ్మన ఉన్న పళ్లూ, చివుళ్ల రుచి నేలబారు జంతువులకి తెలిసేది కాదు. జిరాఫీ మకు ఆత్మీయ బంధువైపోయింది. ఇహ మనతో పాటే తనూను."అన్నాయి జంతువులన్నీ ముక్తకంఠంతో.

కుందేలు చిన్నగా నవ్వి "నా నిర్ణయం సరైనదేనని మీరంతా నమ్మి, జిరాఫీని ఆదరించినందుకు సంతోషంగా ఉంది" అని సమావేశం ముగించింది.

**1 Comment** Sort by Top

Add a comment...



**Naramsetti Umamaheswararao** · Andhra University, Visakhapatnam

Kadha bagundi Sir. Abhinandanalu

Like · Reply · 13 hrs

Facebook Comments Plugin